ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 25.12.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

2. అన్ని మతాలు సమానమనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి వర్గానికి న్యాయం చేయడమే తమ లక్ష్యమని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.

3. రాష్ట్రవ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.

4. రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల్లో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల మేర తక్కువగా నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

-------------------------

**మేడారం-మంత్రి సీతక్క**

మేడారంలో అభివృద్ధి పనులు, సమ్మక్క-సారలమ్మ జాతర పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ములుగు జిల్లాలోని మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సీతక్క ఈరోజు ఆకస్మికంగా పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తో మేడారం గద్దెల ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించి,వాటిని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జంపన్న వాగు వద్ద జరుగుతున్న పనులను కూడా మంత్రి పరిశీలించారు. స్నాన ఘట్టాల పరిసరాలు

ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జంపన్న వాగుకు వెళ్లే రోడ్డు పనులలో వేగం పెంచి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

**(పీటీసీ ములుగు)**

---------------------------------

క్రిస్మస్ స్టేట్

రాష్ట్ర వ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. చర్చీలలోప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రఖ్యాత కేథడ్రల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటన నగరాల్లోని చర్చీలు కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. క్రిస్మస్ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రమంతా క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏసు ప్రభువు బోధనల స్ఫూర్తితో పని చేస్తున్న ప్రజా ప్రభుత్వం అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

**(డెస్క్)**

---------------------------

**మంచిర్యాల క్రిస్మస్ - మంత్రి వివేక్ వెంకటస్వామి..**

అన్ని మతాలు సమానం అనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి వర్గానికి న్యాయం చేయడమే తమ లక్ష్యమని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వివేక్ క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, త్యాగం, శాంతి, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు.

**(సౌండ్ బైట్...మంత్రి వివేక్ వెంకటస్వామి)**

**(పీటీసీ మంచిర్యాల జిల్లా)**

-------------------------------

**క్రిస్మస్-కొండా సురేఖ**

ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకం అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ దేశాయిపేట లోని సిబిసి చర్చ్, మండి బజార్ లోని ట్రినిటీ బాప్టిస్ట్ చర్చిల్లో నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. క్రీస్తు సూచించిన ప్రేమ, దయా, కరుణకు చిహ్నంగా ప్రతి ఒక్కరు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

**(వరంగల్ జిల్లా పిటిసి)**

--------------------------------

**క్రిస్మస్-ఖమ్మం**

ఖమ్మం జిల్లా మధిరలోని బయ్యారం గ్రామంలోని చర్చిలో క్రిస్మస్ సంబురాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేక్ కట్ చేసి ప్రారంభించారు. క్రైస్తవులతో కలిసి ప్రార్ధనలు నిర్వహించి, క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు. ప్రభువు చూపించిన మార్గంలో పయనిస్తూ తోటి వారి కోసం పనిచేద్దామని సూచించారు.

**(PTC, Khammam)**

-----------------------------

**క్రిస్మస్ జిల్లాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లావ్యాప్తంగా ఉన్న చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని సెయింట్ ఆండ్రూస్ చర్చి, పాల్వంచ ఆరోగ్యమాత చర్చిలో జరిగిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్ జిల్లాల్లోనూ క్రిస్మస్ ను క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటున్నారు.

**(పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం ఆసిఫాబాద్, సిరిసిల్ల, మహబూబాబాద్)**

---------------------------

**వాజ్ పేయి**

భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి జయంతిని ఈ రోజు సుపరిపాలనా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ ఉదయం హైదరాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ సమీపంలోని వాజ్ పేయి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు హైదరాబాద్ బీజేపీ కేందర్ కార్యాలయంలో వాజ్ పేయి చిత్రపటానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు.

**(డెస్క్)**

----------------------------

**భద్రాచలం-ఉత్సవాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 6వ రోజైన నేడు శ్రీ స్వామివారు పరశురామ అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి భద్రాద్రి రామయ్యను దర్శించుకుంటున్నారు.

**(PTC-B. KGM)**

-------------------------------

**మహబూబ్ నగర్- మీ డబ్బు - మీ హక్కు**

వివిధ కారణాల వల్ల క్లెయిమ్ చేయకుండా మిగిలిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 'మీ డబ్బు - మీ హక్కు' కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని మహబూబ్ నగర్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ కోరారు. ఈ కార్యక్రమం ఈనెల 31 వరకు కొనసాగుతుందని తెలిపారు.

**(Byte: మహబూబ్ నగర్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ )**

**(పీటీసీ, Mahabubnagar)**

------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడి రాబోయే రెండు రోజుల్లో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల మేర తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 5 నుంచి 10 డిగ్రీమల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

**(డెస్క్)**

------------------------------

**ఆసిఫాబాద్-చలి**

ఆసిఫాబాద్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. నిన్న రాత్రి తిర్యాణి మండలం గిన్నెదరిలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 6.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్రమైన చలిగాలుల దృష్ట్యా జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆశ్రమ పాఠశాలల పనివేళలను మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై పాఠశాలలు ఉదయం 9 గంటలకు బదులుగా 9 గంటల 40 నిమిషాలకు మొదలై సాయంత్రం 4 గంటల 30 నిమిషాల వరకు కొనసాగుతాయన్నారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

-----------------------------

**మహబూబ్ నగర్ ప్రమాదం**

మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ సమీపంలోని హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఈ ఉదయం పాఠశాల బస్సు బోల్తా పడిన ప్రమాదంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. నారాయణపేట జిల్లా మరికల్ కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు విద్యార్థులతో వెళ్తుండగా వెనుక నుంచి ఓ వాహనం ఢీకొట్టడంతో బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులు గాయపడగా వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో వనపర్తి

పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రమాద స్థలాన్ని చూసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

**(డెస్క్)**

-----------------------------

**ఆసిఫాబాద్- ప్రమాదం**

మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆసిఫాబాద్ కాగజ్ నగర్ పట్టణానికి చెందిన ఒకే కుటుంబంలో నలుగురు వ్యక్తులు మ్రతి చెందారు. కాగజ్ నగర్ నిజాముద్దీన్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ జాకీర్ కుటుంబం వైద్యం కోసం మహారాష్ట్రలోని నాగపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా నిన్న అర్ధరాత్రి దాటాక వాళ్లు ప్రయాణిస్తున్న కారు బ్రిడ్జి పైనుంచి కిందపడింది. ఈ దుర్ఘటనలో జాకీర్ భార్య సల్మా బేగం, కూతురు శబ్రీమ్, బంధువులు అఫ్జా బేగం, సహార అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని చంద్రపూర్ ఆసుపత్రికి తరలించారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

------------------------------

**వేములవాడ-కుక్కల దాడి**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి  దేవస్థానం పరిధిలో నిన్న సాయంత్రం, ఈ ఉదయం  వీధి శునకాల దాడిలో 21 మంది భక్తులు గాయపడ్డారు. వారిని చికిత్స కోసం వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఆ ఆసుపత్రిలో రేబిస్ టీకా అందుబాటులో లేకపోవడంతో, బాధితులకు మెరుగైన చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు.

**(పీటీసీ, సిరిసిల్ల)**

----------------------------

**సిరిసిల్ల-విద్య**

విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసంతో పాటు స్వరాష్ట్రం నుంచి ప్రత్యేక ఉపకార వేతనం పొందేందుకు దోహదం చేసే ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ సిస్టమ్- ఐఈఎల్టీఎస్ పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 08723-223004 నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

**( పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

-------------------------------